**గౌరవనీయులైన ప్రధాన న్యాయమూర్తి సతీష్ చంద్ర శర్మ**

**మరియు**

**గౌరవనీయ న్యాయమూర్తి శ్రీ.అభినంద్ కుమార్ షావలి**

**డబ్ల్యు.పి. (పిల్) నెం.29/2021**

**మరియు**

**డబ్ల్యు.పి.నెం.14606/2020**

**ఉమ్మడి ఉత్తర్వు:** (గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తి శ్రీ సతీష్ చంద్రశర్మ గారిచే వెలువరించబడినది)

పైన పేర్కొన్న కేసులలో వాదాంశం ఒక దానితో ఒకటి సంబంధం కలిగి ఉండడంతో రెండు కలిపి విచారణ చేపట్టి ఉమ్మడి ఉత్తర్వుల ద్వారా పరిష్కరించడమైనది.

రిట్ పిటిషన్ (పిల్) నెం.29/2021 వాస్తవాలు క్రింది విధముగా పునరుద్ఘాటించబడ్డాయి:-

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్.ఎం.డి.ఎ) భవన నిర్మాణ అనుమతులేవీ లేకుండా చట్టబద్ధమైన నిబంధనలు/మున్సిపల్ చట్టాలకు విరుద్ధంగా తుర్క యాంజాల్ మున్సిపాలిటిలోని హోటల్ తులిప్స్ గ్రాండ్ నిర్మించబడిందని పేర్కొంటూ లేఖ ఫిర్యాదు తేదీ.04-03-2021 నాటి ఆధారంగా ప్రస్తుత రిట్ పిటిషన్ (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) నమోదు చేయబడింది.

ఈ విషయంలో సమాధానం దాఖలు చేయాలని కోర్టు హెచ్ఎండిఏ ను

ఆదేశించడంతో హెచ్‌ఎండిఏ వివరణాత్మక సమగ్రమైన సమాధానం దాఖలు చేసింది. తగిన న్యాయ సూత్రాలకు అనుగుణంగా, 04-09-2020 తేదీన షోకాజ్ నోటీసు జారీ చేయబడిందని మరియు 27-09-2020 తేదీన సంబంధిత భవన యజమానులకు కోర్టు ధిక్కరణ నోటీసు జారీ చేయబడడంతో వారు కూడా 08-09-2020 తేదీన దానిపై సమాధానం సమర్పించారు.

అనధికార/అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు సంబంధిత భవన యజమానులు 1-10-2020 తేదీన దరఖాస్తును సమర్పించారని, అది కూడా పెండింగులో ఉందని పేర్కొన్నారు.

సంబంధిత భవన యజమానులు రిట్ పిటిషన్ నెం.14606/2020 దాఖలు చేశారని, ఈ కేసులో కోర్టు యధాతథ స్థితిని (స్టేటస్ కొ) పాటించాలని ఉత్తర్వులు జారీ చేసిందని కేసు వాస్తవాలు వెల్లడిస్తున్నాయి. వారు అక్రమ నిర్మాణాలకు సంబంధించి తీసుకోబోయే చర్యలు లేదా అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించేందుకు సంబంధించిన చర్యలు నిలిపివేయబడ్డాయని దీని అర్థం.

ఫలితంగా కేసు పూర్వాపరాలను (మెరిట్స్) పరిగణనలోకి తీసుకోకుండా, ఈ విషయంలో 04-09-2020 తేదీన జారీ చేయబడిన షోకాజ్ నోటీసుకు సంబంధించి, అది కూడా, 08-09-2020 తేదీన సంబంధిత భవన యజమానులు సమర్పించిన సమాధానాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ ఈ రెండు రిట్ పిటిషన్లు, (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) మరియు రిట్ పిటిషన్

పరిష్కరించడమైనది. సముచిత ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియ ఈ రోజు నుండి నలభై ఐదు (45) రోజుల కాల పరిమితిలో ముగించాలి.

అనధికార/అక్రమ నిర్మాణాలను క్రమబద్ధీకరించడానికి దరఖాస్తు కూడా ఉంది. ప్రతివాది అధికారులు పైన పేర్కొన్న కాల పరిమితిలోగా సదరు దరఖాస్తు పైన తగిన ఉత్తర్వులు వెలువరించాలి.

ఈ తరుణంలో, ఈ కోర్టు ద్విసభ్య ధర్మాసనం (డివిజన్ బెంచ్) 18-10-2016 తేదీన డబ్ల్యు.పి.నెం. 5130/2016 బ్యాచ్ లో ఈ కింది విధంగా తీర్పు వెలువరించింది:

> " ఈ రిట్ పిటిషన్ లన్నింటిలో అక్రమ నిర్మాణాలను చేపట్టిన వ్యక్తులు, మరియు 02.11.2015 తేదీ జి.ఓ.ఎం.ఎస్.నెం.152 ప్రకారము క్రమబద్దీకరణ కోసం దరఖాస్తులు చేసుకున్న వ్యక్తులు తమ దరఖాస్తులు ఇంకా సంబంధిత అధికారుల వద్ద పరిశీలనలో ఉన్నందున, తాము కట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయకుండా సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్లను నిరోధించాల్సిందిగా కోరుతూ "మాండమస్" (మాండమస్ అనగా ఫలానా పని చేయవల్సిందిగా ఉత్తర్వు చేయడం) రిట్ జారీ చేయవల్సిందిగా అభ్యర్థిస్తూ ఈ కోర్ట్ అధికార పరిధిని అశ్రయించారు
>
> కేవలం అనుమానంతో కొన్ని కేసుల్లో రిట్

పిటిషనరు దాఖలు చేయగా, మరి కొన్నింటిలో జిహెచ్ఎంసి చట్టంలోని సెక్షన్ 452 (1) కింద గతంలో నిర్మించిన సంబంధిత అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చివేయరాదో సంజాయిషీ కోరుతూ పిటిషనరులకు నోటీసులు జారీ చేయబడ్డాయి. ఈ కోర్టు గతంలో రిట్ పిటిషన్ (పిల్) నెంబరు.63/2016, 20-06-2016 తేదీ మధ్యంతర ఉత్తర్వులను సవరించినందున ఈ రోజు, అనగా 18-10-2016, సదరు ఉత్తర్వులకు అనుగుణంగా ఈ రిట్ పిటిషన్లన్నింటిని పరిష్కరించడం సముచితమని భావిస్తూ పిటిషనరులు గనక జి.ఓ.ఎం.ఎస్.నెం.152 తేదీ.02-11-2015 కు అనుగుణంగా, అందులో నిర్దేశించిన నికృంతన (కట్ ఆఫ్) తేదీకి ముందే లేదా పొడిగించబడిన నికృంతన (కట్ ఆఫ్) తేదీ అయిన 01-03-2016 వరకు పిటిషనరు చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు సంబంధించి బలప్రయోగంతో కూడిన చర్యలను తీసుకోనరాదని సంబంధిత మున్సిపల్ కార్పోరేషన్ లను ఆదేశించడమైనది.

ఒక వేళ క్రమబద్ధీకరణ కోసం పిటిషనరు 01-03-2016న గాని లేదా అంతకు ముందు

గాని దరఖాస్తులను సమర్పించినట్లయితే, వారి దరఖాస్తులపై ప్రతివాది మున్సిపల్ కార్పోరేషన్ నిర్ణయం వెలువరించేటంత వరకు మరియు సదరు నిర్ణయాన్ని వారికి తెలియజేసేటంత వరకు వారు నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి బల ప్రయోగంతో కూడిన చర్యలు తీసుకోరాదు. క్రమబద్ధీకరణ కోసం స్వీకరించిన దరఖాస్తులు తిరస్కరించబడిన సందర్భాలలో జిహెచ్ఎం.సి. చట్టం మరియు దాని కింద రూపొందించిన నియమ నిబంధనల ప్రకారం సంబంధిత నిర్మాణాల కూల్చివేతకు చర్యలు తీసుకోవచ్చు. జి. హెచ్. ఎం. సి చట్టం యొక్క నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు మరియు దాని క్రింద రూపొందించిన నియమాలు మరియు బైలాస్ క్రమబద్ధీకరణ కోసం 01-03-2016 తేదీ లోపు దరఖాస్తులు సమర్పించక పోయినట్లయితే సంబంధిత మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వెసులుబాటును కలిగి ఉన్నారు.

ఈ రిట్ పిటిషన్లన్నింటినీ తదనుగుణంగా పరిష్కరించడమైనది.పెండింగ్లో ఉన్న ఇతర పిటిషన్లు ఏవైనా ఉంటే వాటిని కూడా

కొట్టివేయడమైనది.ఖర్చులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వు లేదు.

ఈ తీర్పులో తెలిపిన వాస్తవాల దృష్ట్యా, క్రమబద్ధీకరణ వ్యవహారంలో సంబంధిత భవన నిర్మాణ యజమానులు దాఖలు చేసిన దరఖాస్తులకు సంబంధించి ద్విసభ్య ధర్మాసనం (డివిజన్ బెంచ్) నిర్ధేశించిన విధివిధానాలను అనుసరించాలని ప్రతివాది అధికారులను ఆదేశించడమైనది.

ఈ విషయంలో ఈ కోర్టు ఆదేశాల ప్రకారం ప్రతివాది అధికారులు తుది ఉత్తర్వులు వెలువరించేటంత వరకు సంబంధిత భవన యజమానులపై బల ప్రయోగంతో కూడిన చర్యలకు దిగారదని స్పష్టీకరిస్తున్నాము.

వివిధ పిటిషన్లు ఏమైనా పెండింగ్ లో ఉంటే వాటిని ముగించడమైనది. ఖర్చులకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వు లేదు.

**సతీష్ చంద్ర శర్మ, ప్రధాన న్యాయమూర్తి**

**అభినందస్ కుమార్ షావిలి, న్యాయమూర్తి.**

తేది: 27.04.2022